# ఆదివాసీ ప్రాంతాల్లో సీఎం సభలు అదుర్స్

- రెండు ఆశీర్వాద సభల్లోనూ జన ప్రవాహం
- సీఎం కేసీఆర్ ప్రసంగానికి ప్రజల హర్షధ్వానాలు
- అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు


దమ్మపేట సభకు తరలివచ్చిన జనవాహిని

ఖమ్మం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట, పినపాక నియోజకవర్గంలోని లక్ష్మీపురంలో సోమవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ప్రజలు సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు తండోప తండాలుగా కదలివచ్చారు. సభా ప్రాంగణాలు కిక్కిరిసిపోవడంతో రహదారులు, చెట్లపైకి ఎక్కి ఆసక్తిగా తిలకించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం కొనసాగినంతసేపు జనం 'జై కేసీఆర్.. జై జై కేసీఆర్.. జయహో తెలంగాణ' అంటూ నినాదాలు చేశారు. సభలో గాయని మధుప్రియ బృందం ఆటా పాట సభికులను అలరించాయి. రెండు సభల్లోనూ పార్టీ శ్రేణుల అభిమానం ఉవ్వేత్తున ఎగిసిపడింది. ధరణి, రైతుబంధు వద్దని కాంగ్రెస్ ఇప్పటికే చెబుతున్నదని సీఎం అనడంతో ప్రజలు పెద్ద ఎత్తున స్పందించి పథకాలు యాథావిధిగా కొనసాగించాలని చేతులెత్తి తమ ప్రతిస్పందనను తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడానికి పడ్డ కష్టాన్ని, ఎదుర్కొన్న ఒడిదొడుకులను, అప్పటి పాలకులు పెట్టిన కష్టాలను సీఎం వివరించడంతో ప్రజలు మంత్రముగ్ధులై ఆసక్తిగా ఆలకించారు. తెలంగాణను ఆంధ్రాలో కలిపిందే కాంగ్రెస్ నేతలు అని, తెలంగాణ సిద్ధించే వరకు నిక్కచ్చిగా పోరాడడంతోనే స్వరాష్ట్రం ఏర్పడిందని చెప్పినప్పుడు హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఏడు ప్రజా ఆశీర్వాద సభలకు సబ్బండ వర్గాల ఆశీస్సులు లభించాయి. ప్రతి సభల్లోనూ జనప్రవాహం ఉప్పొంగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అశ్వారావుపేట నియోజకవర్గంలో పర్యటించడం తొలిసారి కావడంతో ఆయనను చూసేందుకు పెద్ద ఎత్తున గిరిజనులు తరలివచ్చారు. మన్యం ప్రజల సమస్యలను వివరిస్తున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలోని ప్రజలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో సభకు హాజరయ్యారు. పినపాక నియోజకవర్గ సభలో భద్రాచలం, పినపాక నియోజకవర్గాల ప్రజల సమస్యలను సీఎం ప్రస్తావించి.. వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇవ్వడంతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ప్రధానంగా భద్రాచలానికి ఇరువైపులా కరకట్టను నిర్మించడంతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీరుస్తామనడంతో ఆదివాసీల్లో ఆనందం వెల్లివిరిసింది. వరద కష్టాలు ఈ ప్రాంతంలో తాను కళ్లారా చూశానని, వరద ముంపు నుంచి ప్రజలను కాపాడతామని ఇచ్చిన హామీకి పెద్ద ఎత్తున స్పందన లభించింది.

# ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

**మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్**



మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్

ఖమ్మం, నవంబర్ 13: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఓడించి బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని, బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం ఐదు దశాబ్దాలు పనిచేశానని, అయినా పార్టీ తనను అనాథను చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు తనకు సొంత ఇల్లు కూడా లేదన్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి సీటును పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించిందన్నారు. ఈఎన్నికల్లోనూ తనకు అలాగే అవమానం జరిగిందన్నారు. ఆ పార్టీ నుంచి ఎవ్వరూ తనకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీల వ్యతిరేకి అన్నారు. ఆ పార్టీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లో చేరింది పదువుల కోసమో, డబ్బు కోసమో కాదన్నారు. కేవలం ఆత్మాభిమానం కోసమే బీఆర్ఎస్‌లో చేరాన్నారు. సీఎం కేసీఆర్, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుతో మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్‌పై విశ్వాసం మరింత పెరిగిందన్నారు. తాను సీతారామ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలని సీఎంను కోరానన్నారు. వెంటనే సీఎం స్పందించి సత్వరం ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, పార్టీ సీనియర్ నేత ఆర్జేసీ కృష్ణ, నాయకులు డోకుపర్తి సుబ్బారావు, అమరగాని వెంకన్న, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్క్రూట్నీలో 14 నామినేషన్ల తిరస్కరణ

**133 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం**

**వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం కలెక్టర్ వి.పి.గౌతమ్**



మామిళ్లగూడెం, నవంబర్ 13: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరిగింది. నామినేషన్లకు సోమవారం స్క్రూట్నీ జరిగింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 147 నామినేషన్లు దాఖలు కాగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 14 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు 15 వరకు గడువు ఉందన్నారు. ఈ ప్రక్రియ తర్వాత ఇదే రోజు సాయంత్రం నియోజకవర్గాల వారీగా బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. నామినేషన్ పత్రాల పరిశీలన పారదర్శకంగా సాగిందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేశామన్నారు.

**ఐదు నియోకవర్గాల పరిధిలో ఇలా..**

| నియోజకవర్గం | ఆమోదించిన నామినేషన్లు | తిరస్కరించినవి |
|---|---|---|
| ఖమ్మం | 36 | 3 |
| పాలేరు | 40 | 2 |
| మధిర | 17 | 5 |
| వైరా | 15 | 1 |
| సత్తుపల్లి | 25 | 3 |
| మొత్తం | 133 | 14 |

## భద్రాద్రి జిల్లాలో 16 నామినేషన్లు రిజెక్ట్

**రేపు నామినేషన్ల ఉపసంహరణ: భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల**



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో ఈనెల 3 నుంచి 10 వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 136 మంది అభ్యర్థులు 211 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. వాటిలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 16 పత్రాలను తిరస్కరించామన్నారు. బుధవారం నామినేషన్ల ఉప సంహరణకు అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ తర్వాత ఇదే రోజు సాయంత్రం నియోజకవర్గాల వారీగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు.

| నియోజకవర్గం | దాఖలైన నామినేషన్లు | తిరస్కరణకు గురైనవి |
|---|---|---|
| పినపాక | 25 | 3 |
| ఇల్లెందు | 34 | 4 |
| కొత్తగూడెం | 36 | 2 |
| అశ్వారావుపేట | 23 | 2 |
| భద్రాచలం | 18 | 5 |
| మొత్తం | 136 | 16 |

## ఎమ్మెల్యేను కలిసిన ముస్లిం నాయకులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

పాల్వంచ, నవంబర్ 13 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో ఎంఏ ముజీబ్ ముస్లిం మైనార్టీ స్టేట్ లీడ్, సామాజిక కార్యకర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమవారం వనమా వెంకటేశ్వరరావును కలిశారు. పాత పాల్వంచలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రచారం చేస్తున్నట్లు వారు తెలిపారు.అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.

## గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

పినపాక, నవంబర్ 13: పినపాక పోలీసులు గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నియమావళిలో సోమవారం మండల పరిధిలోని ఉప్పాక బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వచ్చిన రెండు బైక్‌లను అడ్డుకుని సోదా చేశారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురి నుంచి 5 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

## హెచ్ఎం సేవలు అభినందనీయం


హెచ్ఎంను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 13 : చింతకాని మండలం కొదుమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుడు పోటు శ్రీనివాసరావు చేసిన సేవలు అభినందనీయమని ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అసాధారణ్ అన్నారు. సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో జక్కేపల్లి పాఠశాల హెచ్ఎంగా బదిలీపై వెళ్తున్న పోటు శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో యలమద్ది వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు, తుళ్ళూరు కోటేశ్వరరావు, డాక్టర్ చావా సత్యప్రసాద్, ఆళ్ళ వెంకట్రావ్, జాకకి బోస్, తాతా రాఘవయ్య, రంగారావు పాల్గొన్నారు.

## స్ప్రింగ్ లీఫ్‌లో పేరెంట్-చైల్డ్ ర్యాంప్ వాక్

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 13 : హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో సోమవారం పేరెంట్ విత్ చైల్డ్ ర్యాంప్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో చదువేకాకుండా వివిధ రకాల విషయాల పట్ల అవగాహన కల్పించేందుకు, తల్లిదండ్రులకు చిన్నారులతో ఉల్లాసంగా గడిపేందుకు కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రాజన్, ప్రీతి, చందన, సరస్వతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

జూలూరుపాడు, నవంబర్ 13: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వీరభద్రాపురంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చందా రమేశ్(32) పదేళ్ల క్రితం ఇదే మండలం అనంతారానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నేళ్ల పాటు దంపతుల వైవాహిక జీవితం బాగానే సాగింది. తర్వాత రమేశ్ మద్యానికి బానిసై భార్యాపిల్లలను పట్టించుకోకపోవడం మానేశాడు. దీంతో భార్య పిల్లలను వెంటబెట్టుకుని పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రమేశ్ దిగాలుగా ఉంటున్నాడు. భార్యాపిల్లలు లేని జీవితం తనకు వద్దని రమేశ్ ఎన్నోసార్లు తల్లిదండ్రులతో అనేవాడు. తల్లిదండ్రులు కుమారుడిని వారించే వారు. ఈ క్రమంలో ఈ నెల 12న రమేశ్ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు రమేశ్‌ను కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తిరుపతిరావు తెలిపారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ: 20 మందిపై కేసులు

పాల్వంచ రూరల్, నవంబర్ 13: అప్పు విషయంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. పోలీసులు 20 మందిపై కేసులు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లికి చెందిన రాపోలు రాజశేఖర్ కొన్ని నెలల క్రితం సత్యనారాయణపురానికి చెందిన గండికోట శంకరయ్య అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చమని శంకరయ్య అడుగుతుండగా రాజశేఖర్ దాట వేస్తున్నాడు. శంకరయ్య దీంతో కొంతమందితో కలిసి సోమవారం ఉల్వనూరు వెళ్లి రాజశేఖర్‌ను నిలదీశాడు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్తా ఘర్షణకు దారి తీసింది. ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదుల మేరకు కొన్నెరసాని పోలీసులు 20 మందిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నారు.